


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:37 ఎడిటర్: రాపోలు లింగస్వామి 07 -10-2025 బుధవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలి

**: గవర్నర్**



మెదక్ జిల్లా, అక్టోబరు 6 : మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా రామాయంపేటలో గవర్నర్ శుక్లా మంగళవారం పర్యటించారు. మెదక్ – సిద్దిపేట నేషనల్ హైవే 765 ఆఉ వెంట జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. 45 కిలోమీటర్ల మేర జీడి మొక్కలు ఔఊంఎ నాటనుంది. నేషనల్ హైవే 765పై రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు జీడీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అనుకుంటే ఏదైనా సాధించి తీరుతుందని తెలిపారు. గతంలో గ్రామాల్లో తుపాకుల గర్జనలు ఉండేవని చెప్పుకొచ్చారు. అలాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని వెల్లడించారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. అందరం కలిసికట్టుగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని గవర్నర్ పేర్కొన్నారు.

**25 ఏళ్ల సుదీర్ఘ నాయకత్వాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా**

**ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని అభినందిస్తూ మంత్రివర్గ తీర్మానం**

## కేంద్ర కేబినెట్ తీర్మానంలోని 10 కీలక అంశాలు



అఖండ హిందుస్థాన్: హైదరాబాద్: 6 అక్టోబర్ 2026:ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్ల సుదీర్ఘ నాయకత్వాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అభినందనలు తెలుపుతూ కేంద్ర మంత్రివర్గం నేడు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇది కేవలం అభినందన మాత్రమే కాదు.. 'దేశమే ప్రథమం, పౌరుడే ప్రథమం' అనే సూత్రంతో ముందుకు సాగుతున్న ప్రధాని శ్రీ మోదీ అసాధారణ ప్రస్థానాన్ని వేడుకగా జరుపుకుంటుంది. గుజరాత్‌లో మూడు వరుస ఎన్నికల్లో సాధించిన అఖండమైన మెజారిటీలు, వరుసగా జరిగిన మూడు లోక్‌సభ ఎన్నికల్లో లభించిన మద్దతు.. ప్రధానమంత్రి శ్రీ ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజలకు ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన అందించిన నాయకత్వం నుంచి భారత ప్రధానమంత్రిగా నాయకత్వం వరకు కొనసాగుతున్న ఈ నిరంతర ప్రయాణాన్ని కింద పేర్కొన్న పది ముఖ్యమైన అంశాలు వివరిస్తున్నాయి.

1. గుజరాత్ నుంచి భారత్ వరకు విస్తరిస్తోన్న అభివృద్ధి దార్శనికత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుజరాత్‌లో విజయవంతమైన కార్యక్రమాలను జాతీయ స్థాయికి ఎలా తీసుకెళ్లారో కేంద్ర మంత్రివర్గ తీర్మానం వివరిస్తోంది. ప్రజల సమస్యలను స్వయంగా విని పరిష్కరించేందుకు ఆయన ప్రారంభించిన స్వాగత్ కార్యక్రమానికి 2010లో ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా పురస్కారం లభించింది. ఆ తర్వాత నిలిచిపోయిన ప్రాజెక్టులనుసమీక్షించడం, ఎదురవుతున్న అడ్డంకులను పరిష్కరించడం, పనులను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ప్రగతి కార్యక్రమానికి స్ఫూర్తిగా నిలిచింది. జ్యోతిగ్రామ్ పథకం 2 **వ పేజీలో ..**

## వాతావరణ మార్పులపై రైతుకు శాస్త్ర సాంకేతిక అండ!

**ల్యాబ్ నుంచి పొలాల దాకా ఆధునిక సాంకేతికతలు.. ప్రాంతాల వారీ కార్యాచరణకు ఐసీఏఆర్**

**-సీఆర్ఐడిఏ లో కీలక భేటీ**



హైదరాబాద్ , జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 6: వాతావరణ మార్పుల ప్రభావాలతో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు చూపుతూ రైతులకు మరింత అండగా నిలవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు సూచించారు. పరిశోధనా సంస్థల్లో అభివృద్ధి చేసిన సాంకేతికతలు కాగితాలకే పరిమితం కాకుండా ల్యాబ్ నుంచి నేరుగా రైతుల పొలాలకు చేరాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ –సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (ఐసీఏఆర్ –క్రీడ )లో 'నేషనల్ ఇన్నోవేషన్స్ ఆన్ క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్ (ఎన్ఐసిఆర్ఏ )–టెక్నాలజీ డెమోన్‌స్ట్రేషన్ కాంపోనెంట్ (టిడిసి )' ఆధ్వర్యంలో "ప్రాంత–నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికల తయారీ, అమలు''పై మూడు రోజుల భాగస్వాముల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. అక్టోబర్ 6 నుంచి 8 వరకు జరిగే ఈ సమావేశంలో అటారి లు, ఐసీఏఆర్ సంస్థలు, కేవికే లు, నోడల్ శాస్త్రవేత్తలు, జెడుఎంసి సభ్యులు, కార్యక్రమ భాగస్వాములు తదితర సంస్థలకు చెందిన 100 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జీబీపీయుఏటీ , పంత్‌నగర్ మాజీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మన్మోహన్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐసిఏఆర్ –క్రీడ డైరెక్టర్ డాక్టర్ వి.కె. సింగ్, ఏడీజీ(అగ్రోనమీ, అగ్రోఫారెస్ట్రీ, క్లైమేట్ చేంజ్) డాక్టర్ ఎన్. రాకేష్ కుమార్, ఐసీఏఆర్ –అటారీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్



ఎన్. మీరా పాల్గొన్నారు. డీడీజీ(ఎక్స్‌టెన్షన్) డాక్టర్ రాజ్‌బీర్ సింగ్, ఏడిజీ(అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్) డాక్టర్ రంజయ్ సింగ్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో 2 **వ పేజీలో ..**

## పులిచింతల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు

**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కమల్లు**

**తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి**



పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగి దాదాపు 20 వేల మెగావాట్లకు చేరినప్పటికీ, గృహ వినియోగదారులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ, థర్మల్ పవర్‌తో పాటు ఇతర వనరులను సమర్థంగా వినియోగిస్తూ విద్యుత్ అవసరాలను తీర్చుతున్నామని చెప్పారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని, నీటి లభ్యత తగ్గడం వల్లే ఉత్పత్తి పరిమితమవుతోందని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి లభ్యతపై దృష్టి సారిస్తూ తాగునీటికి ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని సూచించారు.

## క్రిశాంక్ అరెస్టుపై కెటిఆర్ ఆరోపణలు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎవరిపై పడితే వారిపై నిరాధార ఆరోపణలు చేయొచ్చని, కానీ ఆధారాలతో ప్రశ్నిస్తే తమ పార్టీ నేత క్రిశాంక్‌ను జైలుకు పంపుతారా? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. అనుముల కుటుంబ అవినీతిని ఆధారాలతో ప్రశ్నించినందుకే తమ పార్టీ నేత మన్నె క్రిశాంక్‌ను అక్రమంగా అరెస్ట్ చేయించారని కెటిఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. దేశానికి ప్రధానమంత్రి కావాలనుకుంటున్న రాహుల్ గాంధీ పిరికివాడిలా, నిరంకుశంగా, అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి ఉపన్యాసాలు చేస్తూ, తెలంగాణలో తన తొత్తు రేవంత్ రెడ్డి ద్వారా అరాచక పాలన సాగిస్తున్నారని కెటిఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బరితెగించి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. గల్లీల్లో తిరుగుతూ ఓటు చోరీ అని అరిచే రాహుల్ గాంధీ, తెలంగాణలోనే అతిపెద్ద ఓట్ల దొంగ, ఓటుకు నోటు సూత్రధారికే ముఖ్యమంత్రి కుర్చీ కట్టబెట్టారంటూ కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా నీ కీలుబొమ్మ రేవంత్‌ను అదుపులో పెట్టుకో. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం ఇకనైనా ఆపు అంటూ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

**నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలి**

**: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



ఎల్‌బీనగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 06:మహిళలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక నైపుణ్యాల వరకు, అలాగే బ్యూటీషియన్, మెహందీ వంటి స్వయం ఉపాధికి ఉపయోగపడే కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. తద్వారా కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తమ వంతు సహకారం అందించవచ్చన్నారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, నర్సిరెడ్డి, రాపోలు సుధాకర్, విశ్వ ప్రేమ్, శివప్రకాష్, నాగలక్ష్మి, జయశ్రీ, శోభారాణి, ట్రైనర్లు సునీత, భానుప్రియ, శివబిందు, అర్చనతో పాటు ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మనమెక్కడ..?

పక్షం రోజులపాటు ఆసియా ఖండాన్ని ఉర్రూతలూగించిన ఆటల పండుగకు తెరపడింది. మిరుమిట్లుగొలిపే బాణాసంచా వెలుగులతో, సంబరాలు అంబరాన్ని తాకేలా ముగింపోత్సవాన్ని జపాన్‌లోని నగోయ నగరం ఘనంగా నిర్వహించింది. జపాన్ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శిస్తూ.. ఒకటే ఆసియా అన్న నినాదాన్ని చాటి చెప్పింది.

ఈ క్రీడా మహోత్సవం ముగిశాక మన ప్రతిభాపాటవాలు ఎలా ఉన్నాయని సమీక్షించుకుంటే ఒకింత నిరాశ కలగక మానదు. మూడేళ్ల క్రితం చైనాలోని హాంగ్జౌలో జరిగిన ఆసియాడ్ విజయంతో పోల్చుకుంటే ఈ ప్రదర్శన పేలవమే. గత క్రీడల్లో 107 పతకాలతో సెంచరీ కొట్టిన మన క్రీడాకారులు.. ఈసారి అంతకంటే తక్కువగా 85 పతకాలతోనే సరిపెట్టుకోవడం క్రీడాభిమానులను బాధించింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో పతకాల పట్టికలో నాలుగో స్థానానికి పరిమితమయ్యాం. చైనా ఏకంగా 169 స్వర్ణాలు సహా 341 పతకాలతో అగ్రస్థానంతో తన ఆధిపత్యాన్ని చాటుకోగా.. ఆతిథ్యమిచ్చిన జపాన్ 83 స్వర్ణాలతో కలిపి 269 పతకాలతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. దక్షిణ కొరియా 150 పతకాలతో నిలిచింది. గత కొన్నేళ్లుగా ఈ మూడు దేశాలే మొదటి మూడు స్థానాల్లో ఉంటూండడం గమనార్హం.

ఈ మారు క్రీడల్లో మనం వంద మార్కును చేరలేకపోవడానికి ప్రధాన కారణం అథ్లెటిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో వైఫల్యం. గత క్రీడల్లో అథ్లెటిక్స్‌లో భారత్ ఆరు పసిడి పతకాలు సాధిస్తే, తాజా క్రీడల్లో కేవలం ఒకే స్వర్ణానికే పరిమితమయ్యాం. 30 మందితో జపాన్ వెళ్లిన మన షూటర్ల బృందం మూడు స్వర్ణాలు సహా పదిహేను పతకాలతోనే సరిపెట్టుకుంది. బ్యాడ్మింటన్‌లో భారీ అంచనాలున్న తెలుగు షట్లర్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్‌తో పాటు లక్ష్యసేన్‌లాంటి స్టార్లు జపాన్‌లో తేలిపోయారు. బ్యాడ్మింటన్ బృందం ఈసారి టీమ్ విభాగంలో ఒక్క కాంస్యంతోనే స్వదేశానికి చేరుకుంది.

నాలుగు దశాబ్దాలుగా కనీసం ఒక పతకమైనా అందుకుంటున్న టెన్నిస్ క్రీడాకారులు ఈసారి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. ఆర్చరీలో మాత్రం మనోళ్లు అంచనాలను నిలబెట్టుకుంటూ తొమ్మిది పతకాలతో మెరిశారు. ప్రధానంగా తెలంగాణ అమ్మాయి చికిత, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు జ్యోతి సురేఖ, ధీరజ్, గణేశ్ మణిరత్నం మెరుగైన ప్రదర్శన కనబరచారు. కబడ్డీ, హాకీ, క్రికెట్‌లలో అమ్మాయిలు, అబ్బాయిలు చాంపియన్లుగా నిలవడంతో భారత్ పతకాల ఖాతా విస్తరించింది. స్వర్ణాలు నెగ్గడంతో హాకీ జట్లకు 2028లో లాస్ ఏంజెల్స్ వేదికగా జరిగే ఒలింపిక్స్‌కు బెర్త్‌లు ఖరారవడం హర్షించదగ్గ పరిణామం. ఇక పతకాలు సాధించిన మన అథ్లెట్లలో ఒక్కొక్కరిది భిన్నమైన నేపథ్యం. వీరిలో చాలామంది పేదరికం నుంచి వచ్చినవారే. అనేక కష్టాలు, కన్నీళ్లను దిగమింగుతూనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న వీరి ప్రదర్శన గురించి ఎంత చెప్పినా తక్కువే.

మన క్రీడాకారుల సామర్థ్యం ప్రశంసించదగినదే. సందేహం లేదు.. కానీ మొత్తంగా మన స్థానం ఎక్కడని ప్రశ్నించుకోవాలి. ప్రతిసారీ చైనాతో పోల్చుకోకున్నా.. జపాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్థాన్, ఇరాన్, థాయ్‌లాండ్‌లాంటి దేశాలతో పోల్చి చూసుకుంటే ఒక రకంగా మనం చిన్నబోయినట్టే. క్రీడలకు అంతంత మాత్రమే ఆదరణ కలిగిన ఇరాన్ కూడా 19 స్వర్ణాలతో సత్తా చాటడం చూస్తే, మన ప్రదర్శన ఇంకా మెరుగవ్వాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పదేళ్ల తర్వాత అత్యున్నత క్రీడా సంగ్రామం ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ పట్టుదలగా ఉంది. ఆలోపు దేశంలో క్రీడా సంస్కృతిని మరింత పెంపొందించి నెంబర్‌వన్ కావాలన్న కృత నిశ్చయంతో ఉన్నామన్న కేంద్రం.. అందుకు తగ్గ ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలి. ప్రతిభావంతులను గుర్తించడమే కాదు.. వారిని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేలా కృషి చేయాలి. అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ ఇప్పించాలి. ఈసారి ఆసియాడ్ పోటీల సన్నాహకాల కోసం భారత క్రీడాకారులపై కేంద్ర ప్రభుత్వం రూ. 700 కోట్లకు పైగా వెచ్చించింది. కానీ ఇది సరిపోవడం లేదు. ఆసియాడ్‌లో కన్నా ఒలింపిక్స్‌లో పోటీ ఎక్కువగా ఉంటుంది. మరో రెండేళ్లలో లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ జరగబోతున్నాయి. ఇప్పుడు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుంటూనే, తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలి. అప్పుడే విశ్వ క్రీడారంగాన మన కీర్తిపతాక సగర్వంగా నిలుస్తుంది.

## గుణమే నిజమైన అదృష్టం



గుణవంతుడు గుడ్డివాడైనా అదృష్టాన్ని నమ్ముకోడు,
తన చేతులనే నమ్మి తన దారిని తానే వెతుక్కుంటాడు.
కళ్లకు వెలుగు లేకున్నా సంకల్పం వెలుగై నడిపిస్తుంది,
చీకటి దారిలోనైనా ధైర్యమే దీపమై దారి చూపిస్తుంది.
అదృష్టం తలుపు తట్టాలని అతడు ఎదురు చూడడు,
తన కష్టంతో తలుపులనే తెరిచి ముందుకు సాగుతాడు.
కాలం కలిసిరాకపోయినా కలత చెందడు,
కాలాన్నే మార్చే కృషికి కాళ్లు కడతాడు.
చేతకాని వాడికి అన్నీ ఉన్నా ప్రయోజనం ఉండదు,
బంగారు పంజరం ఉన్నా ఎగరలేని పక్షిలా మిగులుతాడు.
ధనం ఉన్నంత మాత్రాన గుణం గుండెలో పుట్టదు,
పదవి ఉన్నంత మాత్రాన ప్రతిభ పాదాల వద్ద చేరదు.
వజ్రాల కిరీటం పెట్టినా విలువ పెరగదు,
వంకర మనసుకు రాజాసనం పెట్టినా రాజు కాలేడు.
గుణమే మనిషికి గౌరవాన్ని తెచ్చే గంధం,
సామర్థ్యమే జీవితాన్ని నిలబెట్టే నిధి బంధం.
అదృష్టం ఇచ్చినది కాలం తీసుకుపోవచ్చు,
కానీ నేర్చుకున్న నైపుణ్యం ఎవరూ దోచుకోలేరు.
సంపద చేతిలో ఉంటే అది క్షణికమైన బలం,
సద్గుణం గుండెలో ఉంటే అది శాశ్వతమైన బలం.
కష్టాలు వచ్చినప్పుడు గుణవంతుడు కుంగిపోడు,
కన్నీళ్ల మధ్యనైనా తన విలువను కోల్పోడు.
ఓటమి వచ్చినా అది పాఠమని భావిస్తాడు,
పడిపోయిన చోటనే విజయానికి పునాది వేస్తాడు.
అందుకే మనిషికి అదృష్టం కంటే గుణమే గొప్పది,
సంపద కంటే సామర్థ్యమే జీవితానికి కొలమానం.
గుణం ఉన్న మనిషి ఎక్కడున్నా వెలుగవుతాడు,
చేతకాని మనిషి అన్నీ ఉన్నా తన నీడకే ఓడిపోతాడు.
రచన : కె.మురళీమోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

## మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



చండూరు, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 6:చండూరు మున్సిపాలిటీలో మంగళవారం దసరా పండుగను పురస్కరించుకొని మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ, చండూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. పండుగ సందర్భంగా వారికి దుస్తులు అందించడం సంతోషంగా ఉందని, వారి సంక్షేమానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం, మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్స్, కో ఆప్షన్, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీ కలల దారిలో



శుభోదయం నా మనసుకు నచ్చిన అమ్మాయీ,
నీ నవ్వుతో ఈ ఉదయం మరింత అందంగా మారాలి.
నువ్వు కన్న ప్రతి కల నిజం కావాలి,
నీ లక్ష్యం వైపు ప్రతి అడుగు విజయంగా సాగాలి.
ఎన్ని అడ్డంకులు ఎదురైనా నువ్వు ఆగకూడదు,
నీ గుండెలోని ధైర్యం ఎప్పుడూ తగ్గకూడదు.
నీ కళ్లలో మెరిసే ఆశలు వాడిపోకూడదు,
నీ పెదవులపై చిరునవ్వు ఎప్పుడూ చెరిగిపోకూడదు.
నిన్ను నువ్వు నమ్ముకుంటే ఆకాశమే హద్దు,
నీ పట్టుదల ముందు ఓటమి కూడా చిన్నదే.
ఎవరేమన్నా నీ అడుగులను వెనక్కి తిప్పకు,
నీ గమ్యం కనిపించే వరకు ముందుకు నడువు.
నీ కోసం నువ్వు ఎంచుకున్న దారిని గౌరవించు,
నీ కలల కోసం ప్రతి రోజూ కొత్తగా పోరాడు.
నీ విజయం కోసం నా మనసు నిత్యం కోరుకుంటుంది,
నీ ప్రతి ప్రయత్నానికి నా ప్రోత్సాహం తోడుంటుంది.
నీ కళ్లలో కన్నీరు కనిపిస్తే నా మనసు కలత చెందుతుంది,
నీ ముఖంలో ఆనందం కనిపిస్తే నా హృదయం పండుగ చేసుకుంటుంది.
నీకు నువ్వే ఒక అందమైన ప్రపంచం కావాలి,
నీ జీవితానికి నువ్వే వెలుగై నిలవాలి.
నిన్నటి బాధలను ఈ ఉదయంతో విడిచిపెట్టు,
ఈరోజు ఆశలతో కొత్త అడుగు వేయి.
నీ కలలు నీ రెక్కలై ఆకాశాన్ని తాకాలి,
నీ లక్ష్యం నీ చేతుల్లో విజయంగా నిలవాలి.
శుభోదయం.. నువ్వు కోరుకున్న జీవితం నీదే కావాలి.
రచన : కె.మురళీమోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

## సత్తిరెడ్డి కాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

**500 మీటర్ల మేర 200, 300 ఎంఎం డయా పైపులైన్ పనుల ప్రారంభం**

అబ్దుల్లాపూర్ మెట్టు, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 6 : ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధెంకి కృష్ణారెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ జోన్, నాగోల్ సర్కిల్-52 పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ సత్తిరెడ్డి కాలనీలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. కాలనీలో సుమారు 500 మీటర్ల మేర 200 ఎంఎం, 300 ఎంఎం డయా డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించి పనులకు సహకరించారని చెప్పారు.కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని సిద్ధెంకి కృష్ణారెడ్డి అన్నారు. డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తయితే వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడం, ఇళ్ల మధ్య మురుగు ప్రవాహం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పిస్తామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని సిద్ధెంకి కృష్ణారెడ్డి తెలిపారు.



మొదటి పేజీ తరువాయి ..

## వాతావరణ మార్పులపై రైతుకు శాస్త్ర సాంకేతిక అండ!

ప్రారంభమైన కార్యక్రమంలో డాక్టర్ వి.కె. సింగ్ ప్రతినిధులకు స్వాగతం పలికారు. నికర -టిడిసి ద్వారా గతంలో సాధించిన పురోగతిని వివరించడంతో పాటు, వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో కెవికే ల పాత్రను ప్రస్తావించారు.ఆన్‌లైన్‌లో ప్రసంగించిన డాక్టర్ రాజ్‌బీర్ సింగ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు నికర -టిడిసి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయడంతో పాటు, ప్రతి జిల్లా నుంచి రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది అభిప్రాయాలను సేకరించే బలమైన ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్య అతిథి డాక్టర్ మన్మోహన్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, పరిశోధనా సంస్థల్లో అభివృద్ధి చేసిన సాంకేతికతలకు శాస్త్రీయ ధ్రువీకరణ కల్పించి, వాటిని రైతుల పొలాలకు తీసుకెళ్లాలని సూచించారు. దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో వ్యవసాయ రంగం కీలకమని, రైతుల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ పరిశోధనల ఫలితాలు అందుబాటులోకి రావాలని అన్నారు .సమావేశంలో గత ఐదేళ్ల నికర -టిడిసి విజయాలు, అనుభవాలు, సవాళ్లు, నేర్చుకున్న పాఠాలను సమీక్షించనున్నారు. అనంతరం వివిధ కెవికేల ద్వారా జోన్ల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి, తదుపరి దశకు ప్రాంతాల వారీ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే వ్యవసాయం.. రైతుకు శాస్త్రీయ భరోసా.. క్షేత్రస్థాయిలో సాంకేతికత అమలు లక్ష్యంగా నికర -టిడిసి తదుపరి దశకు ఈ సమావేశం కీలకంగా మారనుంది.

## భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధిగా ఎం.సందీప్ సాగర్



సైదాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 06:: భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎం.సందీప్ సాగర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా యువత సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, యువతను సంస్థతో మరింత అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆయనను కోరారు. కొత్తగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను యువతలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.అలాగే యువతలో నాయకత్వ లక్షణాలను ప్రోత్సహిస్తూ, సంస్థ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యువతకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## దళితులకు అండగా నిలవాలి

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**

**షాద్ నగర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మెన్ జాంగారి రవికి సన్మానం**



షాద్ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 06:షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మెన్ గా ఎన్నికైన తెలంగాణ ఉద్యమ కారుడు జాంగారి రవి కి షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్ , వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారుఈ సందర్భంగా మాట్లాడుతూ షాద్ నగర్ నియోజక వర్గం లో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు,దళితుల అభివృద్ధికి కృషి చేయాలి అని జాంగారి రవి కి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కరోల్ల యాదయ్య పాల్గొన్నారు.

# నెక్కొండ గురుకులంలో రౌడీ టీచర్

**గురుకులంలో ఐదో తరగతి విద్యార్థులపై ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి?**

**35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం..**

**మూడు కర్రలు విరిగేలా దాడి చేశారన్న ఆరోపణలు**

**గాయాలపై ఐస్ ముక్కలతో మర్దన, చికిత్స చేయించి విషయం గోప్యంగా ఉంచే ప్రయత్నం**

**ఉపాధ్యాయురాలు రజినిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్**



నెక్కొండ, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 06:నెక్కొండ మండల పరిధిలోని జనరల్ సొసైటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం సాయంత్రం 5వ తరగతి బి సెక్షన్‌కు చెందిన సుమారు 35 మంది విద్యార్థులను ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయురాలు రజిని కర్రలతో కొట్టినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.విద్యార్థులు బాత్రూంకు వెళ్లే సమయంలో జారిపడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందనే కారణంతో వారిని కొట్టినట్లు పాఠశాల యాజమాన్యం సమాధానం ఇచ్చిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే, విద్యార్థులపై కర్రలతో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.మూడు కర్రలు విరిగేలా కొట్టారా?35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టడంతో మూడు కర్రలు విరిగినట్లు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థుల శరీరాలపై గాయాలు, దెబ్బల గుర్తులు కనిపించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.తమ కుమార్తెను చూడటానికి గురుకులానికి వెళ్లిన ఓ విద్యార్థినీ తల్లిదండ్రులకు అసలు విషయం బయటపడినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయురాలు తమను కొట్టిందని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసి ఘటనపై వివరాలు అడిగినట్లు సమాచారం.విషయం బయటకు రాకుండా గోప్యంగా ఉంచే ప్రయత్నంవిద్యార్థులకు గాయాలు కావడంతో విషయం తల్లిదండ్రులకు తెలియకుండా ఉండేందుకు గాయాలపై ఐస్ ముక్కలతో మర్దన చేయడం ఇతర చికిత్సలు చేయడం జరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆరోపించడం జరిగింది దీనితో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారా అనే అనుమానాలు తల్లిదండ్రులు వ్యక్తం అవుతున్నాయి పిల్లల భద్రత రక్షణ బాధ్యత వహించాల్సిన పాఠశాలల్లోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఉపాధ్యాయురాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల వాగ్మూలాలను నమోదు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు ఆరోపణలు నిజమని తెలితే విద్యార్థులపై



దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలు రజిని పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనకు నిర్లక్ష్యం చేసిన పాటశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి సంబంధిత అధికారుల పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వారి గాయాలపై పూర్తిస్థాయిలో చికిత్స చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.పిల్లలను క్రమశిక్షణ పేరుతో కొట్టడం ఏమాత్రం సమంజసం కాదు ఒకవేళ ఉపాధ్యాయురాలు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయిన ఇలాంటి ప్రవర్తన కొనసాగితే మరింత మంది పిల్లలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు ఈ ఘటనపై స్థానిక అధికారులు విద్యాశాఖ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే సమాచారం అందుకున్న నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, నెక్కొండ మండల తహసిల్దార్ రాజకుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వ్యాసం లావణ్య రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులపై జరిగిన దాడి పై విచారణ చేపట్టి పాఠశాల ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# వామ్మో..రైల్వే అండర్ బ్రిడ్జి..!

**- గుంతలు పడి రోజులు గడుస్తున్న మరమ్మత్తులు చేయరేమి..?**

**- బయటకు పొడుచుకొచ్చిన ఇనుప చువ్వలు**

**- ఇక్కడ ప్రమాదమని హెచ్చరిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి**

**- గ్రహించకుండా పోతే ప్రమాదాలే అంటున్న జనం**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):రోడ్డు బాగుంటే.. ప్రజల ప్రయాణం సుఖమయంగా ఉంటుంది.. కానీ ఇక్కడ ఈ రోడ్డు మరణ మార్గాన్ని చూపిస్తుంది.. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ప్రమాదాలు జరగడంతో పాటుగా ప్రాణాలు పోయే పరిస్థితి ఈ ప్రాంతంలో ఉంది.. రహదారిపై గుంటలు ఏర్పడి అందులో నుండి ఇనుప చువ్వలు పొడుచుకొని వచ్చిన.. అధికారులు మాత్రం తమకు ఎందుకులే అన్నట్లుగా ఉందని.. పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి రహదారికి గుంటలు



పడ్డాయి. ఈ గుంతల వల్ల ప్రమాదం మంచి ఉంది. రోడ్డు పునాదుల నుంచి ఇనుప చువ్వలు బయటికి రావడంతో రాకపోకలు సాగించి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ అండర్ బ్రిడ్జి నుండి ఇల్లందు పాల్వంచ భద్రాచలంకు ఆర్టీసీ బస్సులతో





పాటుగా భారీ వాహనాలు పోతుంటాయి. వీటికి తోడు ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు జరుగుతుంటాయి. అలాంటి రైల్వే అండర్ బ్రిడ్జికి గుంటలు ఏర్పడడం వల్ల ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందని ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రోజులు గడుస్తున్న గుంతలకు మరమ్మత్తులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం సహించరానిదని పలువురు అసహన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే రైల్వే అండర్ బ్రిడ్జి గుంతలకు మరమ్మత్తులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ పరిరక్షణ కోసం ఐక్య కూటమినీ గెలిపించండి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**

**- డిపో వద్ద ఆర్టీసీ ఎన్నికల విస్తృత ప్రచారం నిర్వహించిన సిపిఎం జిల్లా నాయకులు**





భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్ డబ్ల్యు ఎఫ్, టి యం యు, టి డబ్ల్యూ యు, ఐ ఎన్ టి యు సి కూటమినీ గెలిపించాలని సిపిఎం నాయకులు మంగళవారం కొత్తగూడెం బస్ డిపో నందు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐక్య కూటమికే ఓట్లు వేస్తే ఆర్టీసీ సంస్థ కోసం కట్టుబడి పని చేస్తారని తెలిపారు. ఆర్టీసీ సంస్థ ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నం చేస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. గతంలో 55 రోజుల సమ్మె సందర్భంగా ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం చేసిన కార్మికుల సత్తా ఏమిటో చాటారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అటువంటి పోరాటాలను శ్రీకారం చుట్టే ఎస్డబ్ల్యుఎఫ్ టీఎంయూ కూటమికే ఆర్టీసీ కార్మికులు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రైవేటు సంస్థలకు అప్పచెబుతున్నా విధానాలను స్వస్తి చెప్పాలంటే ఐక్య కూటమి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో కార్మికులకు ఉపయోగ పడే పే స్కేల్ సాధిస్తారని తెలిపారు. సమస్యలు లేని డ్యూటీలు ఉంటాయన్నారు. డిపోల్లో నిరంతరం వస్తున్న సమస్యల పట్ల పోరాటాలు చేస్తారని అన్నారు. ఒక కార్మికుడికి సమస్య వస్తే వారి వెంటే ఉంటారని కార్మికుడిపై పని భారం పెరిగితే ఆ భారం తగ్గేంత వరకు పోరాటం చేస్తారని అందుకని రాష్ట్రంలో బాణం గుర్తుకు, రీజియన్‌లో నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని తెలియజేశారు. జిల్లా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, కొత్తగూడెం డిపో ఎస్ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల నాగేశ్వరరావు, ఇస్నాపల్లి శామ్యూల్,టి డబ్ల్యూ యు అధ్యక్షులు అనిల్, ప్రమోద్ రామకృష్ణ, షరీఫ్, శ్రీనివాసు, బాలకృష్ణ, రఘు, నసూర్ రాంబాబు కార్మికులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి ..**

# కేంద్ర కేబినెట్ తీర్మానంలోని 10 కీలక అంశాలు

స్థాయిలో అనుసరించదగిన విధానంగా మారింది. గుజరాత్‌లో అమలు చేసిన అనుభవాలను దేశవ్యాప్తంగా విస్తరించారు. 2.. పేదల పట్ల సానుభూతి, భారీ స్థాయిలో గౌరవప్రదమైన జీవితం చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులు, దేశవ్యాప్తంగా పర్యటన సమయంలో పేదరికాన్ని స్వయంగా చూడటం వల్ల ప్రధానమంత్రి శ్రీ మోదీకి పేదల పట్ల ఆవేదన, స్పందన పెరిగింది. ఈ వ్యక్తిగత అనుభవాలే ఇళ్లు, తాగునీరు, బ్యాంకింగ్, వైద్య సేవలను అందించే సంక్షేమ పథకాలుగా మారాయని ఈ తీర్మానం పేర్కొంది. దాదాపు 60 కోట్ల జన్ ధన్ ఖాతాలు, 4 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం, 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం వంటి అంశాలు.. వ్యక్తిగతంగా పేదల పరిస్థితిని అర్థం చేసుకోవడం, ప్రభుత్వ స్థాయిలో చర్యలుగా మారిన తీరును చూపిస్తున్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా కుటుంబాలకు మరింత గౌరవప్రదమైన జీవితం అందుతోంది. 3.. సమాజంలో అన్ని వర్గాలకూ సాధికారత ప్రజలు తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకునేలా సహాయం చేయాలనే ప్రధాని శ్రీ మోదీ సంకల్పం ఈ తీర్మానం ప్రధానంగా కనిపిస్తుంది. దాదాపు 3.5 కోట్ల మంది మహిళలు 'లఖ్‌పతి దీదీలుగా మారగా.. 'నారీ శక్తి వందన్ అధినియమ్' ద్వారా మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్‌ను కల్పించారు. అంకుర సంస్థలు, నైపుణ్యాభివృద్ధి, విద్య రంగంలో చేపట్టిన సంస్కరణలు యువతకు అవకాశాలను విస్తరించాయి. పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి రూ. 4 లక్షల కోట్ల కంటే ఎక్కువ నగదు బదిలీ జరిగింది. అలాగే పీఎం-జన్‌మన్ పథకం ద్వారా అత్యంత వెనుకబడిన గిరిజన తెగలకు ప్రత్యేకంగా సహాయం అందిస్తున్నారు. ఈ విధంగా గతంలో నిర్లక్ష్యానికి గురై, అభివృద్ధికి దూరంగా ఉన్న వర్గాలకు కూడా సంక్షేమాన్ని చేరవేశారు. 4.. సంస్కరణల పట్ల అచంచలమైన నిబద్ధత రాజకీయ ఇబ్బందులు ఉన్నప్పటికీ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చూపిన ధైర్యాన్ని ఈ తీర్మానం ప్రత్యేకంగా ప్రస్తావిస్తోంది. జీఎస్టీ తెచ్చిన మార్పులు, సంక్షేమ పథకాల పంపిణీలో చేపట్టిన సంస్కరణలు, బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకురావడం వంటి నిర్ణయాలు దీర్ఘకాలికంగా ఉన్న సవాళ్లను పరిష్కరించడంలో ఆయనకున్న పట్టుదలను స్పష్టం చేస్తున్నాయి. పారిశుధ్యం, డిజిటల్ చెల్లింపులు, స్థానిక ఉత్పత్తుల వాడకంపై ఆయన చేసిన విజ్ఞప్తులు పౌరులను మార్పు వైపు ఆకర్షించాయి. దృఢ సంకల్పం, ప్రజా భాగస్వామ్యం. జాతీయ లక్ష్యాలతో కూడిన ఆయన నాయకత్వంలో సంస్కరణలు అనేది ఒక నిరంతరం నిబద్ధత కలిగిన ప్రక్రియగా మారాయి. 5.. ఆత్మనిర్భర భారత్ దిశగా బలమైన పునాది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ మూలధన వ్యయం రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు పైగా పెరిగింది. అలాగే జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే విద్యుదీకరణ కూడా వేగవంతమయ్యాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ. 13 లక్షల కోట్లకు పైగా పెరిగింది. రక్షణ రంగ ఉత్పత్తులు, సెమీకండక్టర్ల తయారీ రంగాల్లో సాధించిన పురోగతి వంటివి దేశీయ అవసరాలను భారత్ స్వయంగా తీర్చుకోగల సామర్థ్యాన్ని బలోపేతం చేయాలన్న ప్రధాని శ్రీ మోదీ సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయి. 6.. సాంకేతికతతో ప్రజలకు సేవలు, జాతీయ లక్ష్యాల విస్తరణ రోజువారీ సేవల నుంచి అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక రంగాల వరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి సాంకేతికపై ఉన్న విశ్వాసం స్పష్టంగా కనిపిస్తుంది. జన్ ధన్, ఆధార్, మొబైల్ అనుసంధానం సంక్షేమ పథకాల పంపిణీని మెరుగుపరిచాయి. డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. భారత్ సొంతంగా కోవిడ్ వ్యాక్సిన్లను తయారు చేయడం, చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్ 3ని విజయవంతంగా దింపడం వంటివి శాస్త్రీయంగా సామర్థ్యం కలిగిన, ఆత్మనిర్భర్ భారత్ దృక్పథానికి నిదర్శనాలు. అంతరిక్ష రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యం, కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికత, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో సాధిస్తున్న పురోగతి సైతం ఇదే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయి. సాంకేతికత ప్రజల జీవితాలను మెరుగుపరుస్తూనే జాతీయ అవకాశాలను విస్తరింపజేస్తుంది. 7.. సంక్షోభ సమయాల్లోనూ స్థిరమైన నాయకత్వంప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చితి పరిస్థితులు నెలకున్న సమయాల్లోనూ భారత్‌ను సరైన దిశలో ముందుకు నడిపించడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చూపిన నాయకత్వ సామర్థ్యాన్ని తీర్మానం ప్రస్తావించింది. కోవిడ్ సమయంలో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావంతోపాటు స్వదేశీ వ్యాక్సిన్ల తయారీకి ప్రోత్సాహం అందించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కూడా వేగంగా చేపట్టారు. పశ్చిమాసియా సంక్షోభం సమయంలో సకాలంలో తీసుకున్న నిర్ణయాలు, ఇంధన భద్రతా చర్యలు భారత్‌పై ఎటువంటి తీవ్ర ప్రభావం పడకుండా కాపాడాయి. తక్షణ చర్యలతోపాటు, సంవత్సరాలుగా నిర్మించుకున్న వ్యూహాత్మక సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా కష్టకాలంలో దేశానికి తిరుగులేని స్థిరత్వాన్ని , ఆత్మవిశ్వాసాన్ని అందించింది. 8.. శాంతి, భద్రతను పెంపొందించేలా నిర్ణయాత్మక నాయకత్వం 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ వైమానిక దాడులు, 2025 ఆపరేషన్ సిందూర్ ... దేశ భద్రత విషయంలో ప్రధాని శ్రీ మోదీ నాయకత్వంలో భారత్ అనుసరిస్తున్న స్పష్టమైన వైఖరిని తెలియజేస్తాయని తీర్మానం పేర్కొంది. ఆర్టికల్ 370 రద్దు, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమలు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పదవి ఏర్పాటు వంటి నిర్ణయాలను కూడా తీర్మానం ప్రస్తావించింది. మావోయిస్టు ఉగ్రవాదంపై కఠిన చర్యలు, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి కోసం చేపట్టిన ప్రయత్నాలు కూడా జాతీయ సంకల్పంతో పాటు అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంది. 1. ప్రపంచ వేదికపై బలపడుతోన్న భారత్ స్వరం ప్రపంచ వేదికపై భారత్ ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో దేశాల మధ్య విభేదాలను అధిగమించి సహకారాన్ని పెంపొందించడంలో ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వాన్ని తీర్మానం ప్రస్తావించింది. జీ20, బ్రిక్స్ వేదికలపై ఏకాభిప్రాయం, అభివృద్ధి చెందుతున్న దేశాల తరఫున భారత్ తరచుగా తన వాదనను వినిపించడం, ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో చేర్చడం వంటి చర్యలు ప్రధాని దౌత్య నాయకత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వ్యాక్సిన్ మైత్రీ కార్యక్రమం ద్వారా భారత్ తన సామర్థ్యాలను ఇతర దేశాలకు కూడా ఉపయోగపడేలా చేసింది. 36 దేశాల నుంచి అందిన గౌరవాలు ప్రధాని శ్రీ మోదీకి లభిస్తున్న అంతర్జాతీయ గౌరవాన్ని, ప్రపంచ సమస్యల పరిష్కారంలో భారత్‌కు పెరుగుతున్న ప్రభావం, సహకారానికి లభిస్తున్న గుర్తింపును తెలియజేస్తున్నాయి. 1. వారసత్వం, బాధ్యతో కూడిన అభివృద్ధి అభివృద్ధిని, సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని, పర్యావరణ పరిరక్షణ బాధ్యతలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత ఏకతాటిపైకి తెస్తుంది. గుజరాత్‌లో వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం నుంచి ప్రారంభమైన పర్యావరణ పరిరక్షణ చర్యలు.. నేడు పునరుత్పాదక ఇంధన విస్తరణ, అంతర్జాతీయ భాగస్వామ్యాల స్థాయికి పెరిగాయి. యోగా, చిరుధాన్యాలు, కాశీ విశ్వనాథ్ ధామ్, అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు భారత్‌కు సాంస్కృతిక వారసత్వంతో ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేశాయి. 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించేందుకు సమష్టి కృషి చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతపై కొత్త నిబద్ధతతో ఈ తీర్మానం ముగిసింది.

## ఓబీసీ కాలమ్ చేర్చే వరకు

# కేంద్రంపై పోరాడుతాం

**బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు ప్రకటన**




సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 06:ఓబీసీ కాలమ్ చేర్చే వరకు బిజెపిని వదిలిపెట్టబోమని కేంద్రంపై పోరాడి విజయం సాధించి తీరుతామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యాలయం బొమ్మగాని ధర్మభిక్షం భవనంలో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాతి జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని ప్రధాన డిమాండ్ తో బీసీలు రోడ్డు ఎక్కి ఉద్యమిస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టైనా లేకపోవడం సిగ్గుచేటని, ఓ బి సి కాలమ్ చేర్చే వరకు కేంద్రంపై పోరాటం కొనసాగిస్తామని బీసీల లెక్కలు తేలితే తమకు భవిష్యత్తులో రాజకీయంగా నష్టం జరుగుతుందని కుట్రతోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రస్తుతం జరిగే జన గణనలో ఓబీసీ కాలమ్ చేర్చడం లేదని, కుల గణన చేయకుండా బీసీ వ్యతిరేక పార్టీగా మిగిలిపోతారని భవిష్యత్తులో ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోతుందని ఇప్పటికే బిజెపి అగ్రవర్ణాల పార్టీగా ముద్ర వేసుకున్నదని ఇక జనగణన లో ఓబిసి కాలమ్ లేకపోతే బీసీలు మరి కొన్ని దశాబ్దాల కాలం వెనుకబాటు తనానికి గురవుతారని అలాగే బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేయని పార్టీలు కూడా బీసీ ద్రోహులు గానే చరిత్రలో మిగిలిపోతారని జాతీయస్థాయిలో ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని ముఖ్యంగా ఇండియా కూటమిలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ ఉద్యమానికి మద్దతునివ్వాలని ఎన్డీఏ కూటమిలోని రాజకీయ పక్షాలు ఆత్మ పరిశీలన చేసుకుని బీసీల పక్షాన ఉండాలా బిసి వ్యతిరేక పార్టీలుగా మిగిలిపోవాలో తెలుసుకోవాలని ఆయన అన్నారు.సమావేశానికి పి సాంబశివరావు అధ్యక్షత వహించగా సిహెచ్ రాములు వి వెంకటేశ్వర్లు ఎన్ బిక్షం ఆర్ సైదులు పి సోమయ్య తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ సినిమా థియేటర్ కార్మికులకు దసరా సందర్భంగా బోనస్ ఇవ్వాలని కోరుతూ

# లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 06: తెలంగాణ రాష్ట్రంలోని సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లు మరియు మల్టీప్లెక్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు దసరా పండుగ సందర్భంగా బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారుతెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో అనేక మంది కార్మికులు, సిబ్బంది సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. వీరిలో టికెట్ సిబ్బంది, బుకింగ్ క్లర్కులు, గేట్ సిబ్బంది, ప్రొజెక్షన్/టెక్నికల్ సిబ్బంది, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, క్యాంటీన్ సిబ్బంది, పార్కింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.సినిమా థియేటర్ల నిర్వహణలో వీరి పాత్ర ఎంతో ముఖ్యమైనది. అయినప్పటికీ అనేక మంది కార్మికులకు పండుగల సందర్భంగా తగిన ఆర్థిక ప్రోత్సాహకాలు, బోనస్‌లు అందడం లేదని మా దృష్టికి వస్తోంది.ప్రస్తుతం దసరా పండుగ సందర్భంగా కార్మికులు మరియు వారి కుటుంబాలు పండుగను సంతోషంగా జరుపుకునేందుకు వీలుగా, రాష్ట్రంలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు మరియు మల్టీప్లెక్స్ యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు చట్టపరంగా వర్తించే బోనస్/పండుగ బోనస్‌ను చెల్లించేలా కార్మిక శాఖ తరఫున తగిన ఆదేశాలు మరియు సూచనలు జారీ చేయాలని కోరుతున్నాము.తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ మారన్నా మాట్లాడుతూసినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికులకు వర్తించే కార్మిక చట్టాలు అమలు అవుతున్నాయా లేదా పరిశీలించాలి. అర్హులైన కార్మికులకు బోనస్ చెల్లింపు జరుగుతున్నదీ లేదో తనిఖీ చేయాలి.కార్మికులకు జీతాలు, పని గంటలు, సెలవులు, ఓవర్‌టైమ్, బోనస్ తదితర చట్టబద్ధమైన హక్కులు అందేలా చర్యలు తీసుకోవాలి. బోనస్ చెల్లించని థియేటర్లపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి.దసరా పండుగకు ముందుగానే అర్హులైన కార్మికులకు బోనస్ అందేలా సంబంధిత యాజమాన్యాలకు సూచనలు ఇవ్వాలి.సినిమా థియేటర్ కార్మికులు కూడా సమాజంలో ఒక ముఖ్యమైన శ్రామిక వర్గం. వారి కృషిని గుర్తించి పండుగ సమయంలో వారికి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా వారి కుటుంబాల్లో ఆనందాన్ని పెంచవచ్చు.కాబట్టి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లు మరియు మల్టీప్లెక్స్‌లలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు దసరా సందర్భంగా చట్టప్రకారం లభించాల్సిన బోనస్‌ను సకాలంలో చెల్లించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, అవసరమైన తనిఖీలు నిర్వహించి, కార్మికులకు న్యాయం చేయవలసిందిగా మనవి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ ముఖ్య ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు ఈ కార్యక్రమానికి సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అండ్ మారన్న ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జె కుమారస్వామి ట్రాన్స్పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె అజయ్ బాబు సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే అరుణ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి పుల్లారావు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి కమలాకర్ గౌడ్. మురళి. యాదగిరి. చలం. రాజు. నాగేందర్.భరత్.ప్రదీప్. సుధాకర్. వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం




హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి , అక్టోబర్ 06:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'టీ–సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల' ఏర్పాటుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ–సేవ ఆన్‌లైన్ స్కిల్ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా నగర స్థాయిలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు వివిధ రకాల డిజిటల్, బ్యాంకింగ్ సేవలతో పాటు విద్యా, ఉద్యోగ సంబంధిత శిక్షణలను అందిస్తూ అభ్యర్థులు స్వయం ఉపాధి పొందవచ్చని వెల్లడించారు.కేంద్రాల ద్వారా లభించే ముఖ్య సేవలు:బ్యాంకింగ్ ఢ డిజిటల్ సేవలు: కొత్త పాన్ కార్డ్ దరఖాస్తులు, సవరణలు, బస్సు, రైలు, విమాన టిక్కెట్ల బుకింగ్, మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్, మైక్రో ఏటీఎం సేవలు, క్యాష్ డిపాజిట్లు, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్సూరెన్స్, అన్ని రకాల బిల్లుల చెల్లింపులు, కొత్త బ్యాంకు ఖాతాల ప్రారంభం.ఉపాధి అండ్ నైపుణ్యాభివృద్ధి సేవలు: 100కి పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆమోదిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్లు, 100కి పైగా ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల మాక్ టెస్ట్‌లకు రిజిస్ట్రేషన్లు.విద్యార్థులకు అవకాశాలు: డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, గుర్తింపు పొందిన యూనివర్సిటీ ఆన్‌లైన్ కోర్సుల రిజిస్ట్రేషన్లు.ఇతర సేవలు: కంప్యూటర్ టైపింగ్, డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్, డాక్యుమెంటేషన్ సేవలు.ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ముగింపు తేదీ అక్టోబర్ 15, 2026.పూర్తి వివరాల కోసంను సందర్శించవచ్చని, లేదా 8179955744 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని డైరెక్టర్ వివరించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మునుగోడు, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, , అక్టోబర్ 6:చండూరు మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించే కార్యక్రమం ఈరోజు చండూరులో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.కార్యక్రమంలో ఎంపీడీవో బి. యాదగిరి, మండల విద్యాధికారి ఊట్కూరు సుధాకర్ రెడ్డి, తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల మండల అధ్యక్షులు, ఎంఆర్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయుల వివరాలు:– రావిరాల అరుణ ? స్కూల్ అసిస్టెంట్, తెలుగు– ఎస్.కె. మజీద్ ? స్కూల్ అసిస్టెంట్, తెలుగు– అనిల్ కుమార్ ? స్కూల అసిస్టెంట్, ఇంగ్లీష్– కే. సత్యవతి ? ఎస్జీటీ,– ఎన్. అనిత ? ఎస్జీటీ,– బి. చైతన్య, ఎస్జీటీ,– కే. శరత్ బాబు ? ఎస్జీటీ,– జి. శ్రీనివాసులు ? ఎస్జీటీ,– కె. అనిత ? ఎస్జీటీ,– ఆర్. చౌకిసింగ్ ? ఎస్జీటీ,– ఆరంజ్యోతి ? కేజీబీవీ.ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు

# మంత్రి గారితో మనోజ్ కుమార్



ప్రకాశం, జ్యోతి ప్రభంజనం,ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గౌరవనీయులు పెద్దలు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త శ్రీ కనపర్తి మనోజ్ కుమార్ , జరుగుమల్లి మండల మాజీ అధ్యక్షులు గూడా శశిభూషణ్, పొన్నలూరు మండలం నాయకులు పత్తిపాటి మాధవరావు , మిడసల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 06:భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు





హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్టలోని అంగన్వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు.ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అంగన్వాడీ కేంద్రంలోని పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య సేవలు, ఇతర సౌకర్యాలపై అంగన్వాడీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాయకులు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక అభివృద్ధికి ఎంతో కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి పనిచేయడమే బీజేపీ నాయకుల లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మ రెడ్డి, నాయకులు పార్వతి, సీనియర్ నాయకులు గోవింద చారి, జంజ్య నాయక్, మొగులయ్య, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అభిలాష్, రీతిక్, ఇతర పార్టీ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు మూడు గ్రామాల్లో జాయింట్ తనిఖీలు



సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురం, మామిళ్ల మాధవ, బి.కొత్తపల్లి గ్రామాలలో ఇసుక సాండ్ అండ్ వాషింగ్ నిర్వహణకు స్పాట్ లైసెన్స్ జారీ చేసేందుకు సంబంధించి ఈ రోజు జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు.మైన్స్ అండ్ జియాలజీ శాఖ సూర్యాపేట అధికారులు, మద్దిరాల ఎస్ఐ, ఏఎంవీఐ సూర్యాపేట అధికారులతో కలిసి సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకాలు, నిల్వలు, రవాణాకు ఉపయోగించే ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా సాండ్ వాషింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని, వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు.పర్యావరణానికి భంగం కలగకుండా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని సూచించారు...

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com